గాలీవాన బీభత్సం

- దెబ్బతిన్న అరటి, మొక్కజొన్న, వరి
- ప్రభుత్వం ఆదుకోవాలని రైతుల వినతి

పుట్లూరు/గార్లదిన్నె: అకాల వర్షంతో రైతులకు తీరని నష్టం కలిగింది. ఉరుములు, మెరుపులతో కూడిన వడగండ్ల వర్షంతో కాస్తోకూస్తో ఉన్న పంటలూ దెబ్బతినగా రైతులకు రూ.లక్షల్లో నష్టం వాటిల్లింది. ఉద్యాన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. అరటి, మొక్కజొన్న, వరి పంటలకు నష్టం జరిగింది. వివరాలు.. పుట్లూరు మండలంలోని చెర్లోపల్లి, దోసలేడు, మడ్డిపల్లి, కడవకల్లు తదితర గ్రామాల్లో సోమవారం రాత్రి ఈదురు గాలులతో కూడిన వడగండ్ల వర్షం కురవడంతో అరటి, మొక్కజొన్న రైతులు తీవ్రంగా నష్టపోయారు. గాలులకు అరటి తోటలు, మొక్కజొన్న నేలకొరిగాయి. 180 ఎకరాల్లో అరటి, 30 ఎకరాల్లో మొక్కజొన్న పంటలు నష్టపోయినట్లు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెబ్బతిన్న పంటలను రైతు సేవా కేంద్రం సిబ్బంది క్షేత్ర స్థాయికి వెళ్లి పరిశీలించారు. వడగండ్ల వర్షం వల్ల నేలపై పడ్డ అరటి గెలలు పూర్తిగా దెబ్బతిన్నట్లు రైతులు వాపోయారు. అలాగే గార్లదిన్నె మండల వ్యాప్తంగా సోమవారం ఈదురు గాలులకు గ్రామాల్లో వరి,మొక్కజొన్న పంటలు నష్టం జరిగినట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. మంగళవారం వ్యవసాయ అధికారులు గ్రామాల్లో పర్యటించి పంట నష్టం అంచనా వేశారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ ఇల్లూరు, కొప్పలకొండ, కమలాపురం, శిరి వరం గ్రామాల్లో ఈదురు గాలులకు 15 ఎకరాల్లో వరి, 10 ఎకరాల్లో మొక్కజొన్న పంటలకు నష్టం జరిగిందన్నారు. వరి పైరు , మొక్కజొన్న పంట చేతికి వచ్చే సమయంలో నేల వాలడంతో తీవ్ర నష్టం వాటిల్లిందని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం పంట నష్టం చెల్లించి ఆదుకోవాలని రైతులు కోరారు.


పుట్లూరు మండలం చెర్లోపల్లిలో ఈదురు గాలికి దెబ్బతిన్న అరటి


గార్లదిన్నె మండలం ఇల్లూరులో నేలవాలిన వరి పంట

పెట్టుబడి కూడా రావడం లేదు



ఈదురు గాలులు, వడగండ్ల వర్షం వల్ల పెట్టిన పెట్టుబడులు చేతికి రావడం లేదు. లక్షలాది రూపాయల పెట్టుబడితో ఎన్నో ఆశలతో అరటిని సాగు చేసిన రైతులు నిత్యం భయాందోళనకు గురి కావాల్సిన పరిస్థితి. నాలుగు ఎకరాల్లో అరటి పంటను సాగు చేయగా గాలులకు దాదాపు 1000 అరటి చెట్లు నేలకొరిగాయి. చాలా మంది రైతుల అరటి తోటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం స్పందించి రైతులను ఆదుకోవాలి.

– కేశవ, రైతు, దోశలేడు, పుట్లూరు మండలం

రైతన్నలకు కన్నీరే ..



వ్యవసాయాన్ని నమ్ముకుని కష్టపడుతున్న రైతన్నలకు కన్నీరే మిగులుతోంది. అతివృష్టి, అనావృష్టితో పాటు ఈదురు గాలులు, వడగండ్ల వర్షాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఈదురు గాలులు, వడగండ్ల వర్షం వల్ల చెర్లోపల్లి, కడవకల్లు, దోసలేడు, సూరేపల్లి తదితర రెవిన్యూ గ్రామాల్లో దాదాపు 200 ఎకరాల్లో అరటి, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. ప్రభుత్వం రైతులకు పరిహారం అందించాలి.

మూలి వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డు మాజీ వైస్ చైర్మన్, చెర్లోపల్లి

గుత్తి కోటను అభివృద్ధి చేయాలి

గుత్తి రూరల్: పట్టణంలోని పురాతన గుత్తి కోటను పర్యాటక కేంద్రంగా ప్రకటించి, అభివృద్ధి చేయాలని వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ జిల్లా అధ్యక్షుడు, గుత్తి కోట సంరక్షణ సమితి కార్యదర్శి వై.రాజశేఖర్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయం వద్ద తహసీల్దార్ ఓబిలేసు, సీఎస్ డీటీ సూర్యనారాయణకు వారు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గుత్తి కోట వద్ద హరిత హోటల్ ఏర్పాటు చేయాలన్నారు. కోటపై నుంచి రోప్‌వే ఏర్పాటు చేస్తే పర్యాటకంగా అభివృద్ధి చెంది స్థానికులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కోటలో శిథిల కట్టడాలను పునఃనిర్మించాలని వారు డిమాండ్ చేశారు. కోటపై తాగునీటి వసతి కల్పించాలన్నారు. కోట కింద భాగంలో పార్కులు, చిన్న పిల్లలు ఆడుకునే పరికరాలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో కోట సంరక్షణ సమితి నాయకులు వెంకటరామిరెడ్డి, కాశీరావు, కోటేశ్వరరావు, కోట గైడ్ రమేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడి ప్రమాణ స్వీకారం

గుంతకల్లు రూరల్: మండలంలోని నాగసముద్రం గ్రామానికి చెందిన తోటపల్లి లోకనాథ శర్మ మంగళవారం అమరావతి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బ్రాహ్మణ సంఘం ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. గత నెల 15న కసాపురం దేవస్థానం సమీపంలోని ఆర్యవైశ్య కల్యాణమండపంలో రాష్ట్ర బ్రాహ్మణ సంఘం సమావేశం నిర్వహించి కార్యవర్గాన్ని ఎన్నుకున్న విషయం విదితమే. సమావేశంలో బ్రాహ్మణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా కోనూరు సతీష్ శర్మ, ఉపాధ్యక్షుడిగా లోకనాథ శర్మను ఎన్నుకున్నారు. ఈ క్రమంలో మంగళవారం అమరావతిలోని దేవదాయ ధర్మాదాయ శాఖ ఆడిటోరియంలో బ్రాహ్మణ సంఘం కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా లోకనాథ శర్మ ఉపాధ్యక్షుడిగా ప్రమాణ స్వీకారం చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానం పాలక మండలి సభ్యుడిగా పనిచేసిన లోకనాథ శర్మ ఆలయ అభివృద్ధికి ఎంతగానో కృషి చేశారు.


ప్రమాణ స్వీకారం చేస్తున్న లోకనాథ శర్మ

నేడు మండల సమావేశం

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉదయం 11 గంటలకు మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ గంగాదేవి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ వాసుదేవరెడ్డి మంగళవారం తెలిపారు. కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైఎస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, అధికారులు, సర్పంచులు హాజరు కావాలన్నారు.

త్రైత సిద్ధాంతం క్యాలెండర్ల అందజేత

గార్లదిన్నె: విశ్వా వసు నామ సంవత్సరం త్రైత సిద్ధాంతం ఉగాది కాలెండర్లను త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వాస్పత్రి, ఎంపీడీఓ కార్యాలయం, ప్రభుత్వ హైస్కూల్, రైతు సేవా కేంద్రం సిబ్బందికి ఉచితంగా అందజేశారు. త్రైత సిద్ధాంత కమిటీ సభ్యులు రవికుమార్, శివరామ్ ప్రసాద్, సూర్యనారాయణ రెడ్డి, రామక్రిష్ణ, చిరంజీవి, నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

సామాన్యులకు విద్యుత్ బిల్లుల మోత

పామిడి: కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సామాన్యులపై విద్యుత్ బిల్లులు భారం పెరిగిందని మంగళవారం ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం మండల సీనియర్ నాయకుడు పీ అనిమిరెడ్డి, మండల కార్యదర్శి ఆర్.ముత్యాలు, సీపీఎం మండల కార్యదర్శి మల్లేసు ధ్వజమెత్తారు. పెంచిన విద్యుత్ బిల్లులతో సామాన్యులు విలవిలలాడుతున్నారన్నారు. ట్రూ అఫ్ సర్దుబాటు చార్జీలను రద్దు చేయాలన్నారు. స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలన్నారు, సెల్ ఒప్పందం, టైమ్ ఆఫ్ రద్దు చేయాలన్నారు. టైఫ్ ఆఫ్ డే విధానం రద్దు చేయాలన్న తదితర అంశాలతో కూడిన బుక్‌లెట్లను విడుదల చేశారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన

గుంతకల్లుటౌన్: పట్టణంలోని 60 అడుగుల రోడ్, తిలక్‌నగర్ ఏరియాల్లో పారిశుద్ధ్య పనులను మంగళవారం ఉదయం మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పరిశీలించారు. చెత్తసేకరణ క్రమంగా జరిగేలా చూడాలని శానిటేషన్ కార్యదర్శులకు సూచించారు.

ఆస్పత్రిలో క్షయ పరీక్షలు

పుట్లూరు: క్షయ వ్యాధికి గురైన వారి కుటుంబ సభ్యులకు క్షయ నిర్ధారణ పరీక్షలు నిర్వహించినట్లు వైద్యాధికారి శ్రీవాణి మంగళవారం తెలిపారు. క్షయ రోగులకు దగ్గరగా ఉండే కుటుంబ సభ్యులకు స్కిన్ టెస్ట్ నిర్వహించి 48 గంటల్లో వ్యాధి నిర్ధారణ చేస్తామన్నారు. ఈ పరీక్షల్లో వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయితే, వైద్య చికిత్సలు అందిస్తామన్నారు. మంగళవారం 15 మందికి ల్యాబ్ టెక్నీషియన్ మహబూబ్‌బాషా (సీవై-టీబీ) పరీక్షలు చేశారన్నారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు సునీల్, నాగరాజు, కిరణ్‌కుమార్, లక్ష్మీదేవి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి

పెద్దవడుగూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతులను ఆదుకోవాలని సీపీఎం, రైతు సంఘం నాయకులు దస్తగిరి, సుధీర్‌రెడ్డి కోరారు. మంగళవారం రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ తహసీల్దార్ ఉషారాణి, యూనియన్ బ్యాంకు మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. రైతుల సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామని హెచ్చరించారు. రైతులు కదిరప్ప, పుల్లన్న, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కరిడికొండ ఆలయంలో చోరీ

గుత్తి రూరల్: మండలంలోని కరిడికొండ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చోరీ జరిగింది. ఆలయ కమిటీ సభ్యులు తెలిపిన మేరకు... సోమవారం అర్ధరాత్రి గుర్తు తెలియని వ్యక్తులు ఆలయ తాళాలను బద్దలు కొట్టి లోపలకు చొరబడి హుండీని ఆలయం వెనుకకు ఎత్తుకెళ్లి అందులోని నగదు అపహరించారు. మంగళవారం ఉదయం ఆలయానికి వెళ్లిన భక్తులు తలుపులు తెరిచి ఉండడం గమనించి, సమాచారం ఇవ్వడంతో గ్రామస్తులు అక్కడకు చేరుకుని పరిశీలించారు. చోరీ జరిగినట్లు నిర్ధారించుకుని సమాచారం ఇవ్వడంతో పోలీసులు సంఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

సమస్యల పరిష్కారానికి కృషి

గుత్తి రూరల్: మండలంలోని ఊటకల్లు గ్రామంలో సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ తెలిపారు. మంగళవారం గ్రామంలో ఎంపీడీఓ పర్యటించారు. గుట్ట కాలనీలో తాగునీటి సమస్య అధికంగా ఉందని ప్రజలు ఎంపీడీఓ దృష్టికి తెచ్చారు. నూతన బోరు, పైప్‌లైన్ వేసి త్వరలోనే నీటి సమస్య పరిష్కరిస్తామని ఎంపీడీఓ తెలిపారు. ఈఓఆర్డీ శివాజీరెడ్డి, కార్యదర్శి సాదిక్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని మార్నేపల్లి శివారులో 67వ నంబర్ జాతీయ రహదారిపై మంగళవారం ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడి ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల వివరాల మేరకు. గుంతకల్లు మండలంలోని వైటీచెరువు గ్రామానికి చెందిన షంషీర్, గుత్తికి చెందిన షాకిర్ బాషా పనినిమిత్తం గుత్తి నుంచి వైటీ చెరువుకు ద్విచక్రవాహనంలో బయలుదేరారు. మార్నేపల్లి శివారులో వేగంగా వెళ్తున్న ద్విచక్రవాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఘటనలో ఇద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. గమనించిన వాహనదారులు 108లో క్షతగాత్రులను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం వైద్యుల సూచన మేరకు మెరుగైన చికిత్స కోసం షంషీర్‌ను అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రేత అరెస్టు

యాడికి: మండల కేంద్రంలో మద్యం బాటిళ్లు అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో నిందితుడు నాగభూషణం నుంచి 12 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామన్నారు.

బైక్ బోల్తా–ఇద్దరికి గాయాలు

గుత్తి: పట్టణంలోని తాడిపత్రి రోడ్డులో మంగళవారం రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. వివరాలు.. యాడికికి చెందిన శ్రీనివాసులు, రాము బైక్‌లో గుత్తికి వచ్చి తిరిగి వెళుతుండగా కుక్క అడ్డు రావడంతో బైక్ బోల్తా పడింది. ఘటనలో ఇద్దరూ గాయపడ్డారు. స్థానికులు గమనించి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించారు.

వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

గుంతకల్లు: కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో బీజేపీ ప్రభుత్వం తీసుకువచ్చిన వక్ఫ్ బోర్డు సవరణ చట్టం రద్దు చేయాలని ముస్లిం మతపెద్దలు, వివిధ పార్టీల నాయకులతో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. సమావేశానికి సీపీఐ పట్టణ సహాయ కార్యదర్శి ఎస్ఎండీ గౌస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా బేషరతుగా వక్ఫ్‌బోర్డు నూతన చట్టం రద్దు చేయాలని నాయకులు ముక్తకంఠంతో నినదించారు. కేంద్ర ప్రభుత్వం మతాల మధ్య చిచ్చు పెడుతోందని ఆరోపించారు. మోదీ, అమిత్‌షా రాజ్యాంగాన్ని నిర్వీర్యం చేస్తూ ఈ చట్టాన్ని తెచ్చారన్నారు. కేవలం వక్ఫ్ బోర్డు ఆస్తులను పక్కదారి పట్టించాలనే ఉద్దేశ్యంతోనే ఈ చట్టాన్ని తెర మీదకు తెచ్చారని ఆరోపించారు. వెంటనే ఈ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి జాఫర్, ప్రభుత్వ ఖాజీలు రజక్‌పీర్, సత్తార్, అంజుమన్ కమిటీ అధ్యక్షుడు మన్సూర్, వైఎస్సార్‌సీపీ నాయకులు ఖలీల్, మౌలా, అబ్దుల్‌బాసిద్, ఎం ఎం రహిమన్, సమోబాషా, చాంద్‌బాషా, నూర్ నిజామి, ఫ్లయింగ్‌మాబు ఆర్‌జేడీ భాషా, కాంగ్రెస్ పార్టీ నాయకులు దౌల్తాపురం ప్రభాకర్, మైనార్టీ నాయకులు దాదాఖలందర్, సీఎం ఫిరోజ్, గులాం, సీపీఐ నాయకులు వీరభద్రస్వామి, గోపీనాథ్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సీపీఐ నాయకుడు జగదీష్

అంబేడ్కర్‌ను స్ఫూర్తిగా తీసుకోవాలి

గుంతకల్లు: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాలను యువత స్ఫూర్తిగా తీసుకోవాలని డివిజనల్ రైల్వే మేనేజర్ (డీఆర్ఎం) చంద్రశేఖర్ గుప్తా పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక రైల్వే క్లబ్‌లో అంబేడ్కర్ జయంతి వేడుకలను గుంతకల్లు రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డీఆర్ఎంతోపాటు ఏడీఆర్ఎం సుధాకర్ హాజరయ్యారు. ముందుగా అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం డీఆర్ఎం మాట్లాడుతూ విద్య, సామాజిక సంస్కరణ ద్వారా భారతీయుల్లో సామర్థ్యాన్ని వెలికితీయడం, ప్రేరేపించడం అంబేడ్కర్ గొప్పతనమన్నారు. సామాజిక, ఆర్థిక స్థితిగతులు, ఇతర అంశాలతో సంబంధం లేకుండా ప్రతి పౌరుడిని స్వశక్తుడిని, శక్తివంతుడిగా నిలిపేందుకు దీర్ఘకాల దృష్టితో రాజ్యాంగాన్ని అంబేడ్కర్ మనకు అందిచారన్నారు. కార్యక్రమంలో డీపీఓ ఎస్ఎల్ఎస్ ప్రసాద్, ఏపీఓ వలి, వివిధ విభాగాల అధికారులు, ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్, మజ్దూర్, ఎంప్లాయీస్ సంఘ్ నాయకులు పాల్గొన్నారు.


అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేస్తున్న డీఆర్ఎం సీఎస్‌గుప్తా

కనుల పండువగా కల్యాణోత్సవం

పామిడి: పట్టణ సమీపంలోని పెన్నానదిలో ఉన్న సీతారామలక్ష్మణాంజనేయ స్వామి ఆలయంలో మంగళవారం రాత్రి శ్రీరామ నవమి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అరిగేల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వేద పండితుడు గొల్లపల్లి మహదేవయ్య శాస్త్రి వేద మంత్రోచ్చారణల నడుమ ధనుంజయ, వెంకటేశ్వర్లు దంపతుల సారథ్యంలో సీతారాములు కల్యాణోత్సవం కనులపండువగా నిర్వహించారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తరించారు. ఏటా చైత్ర మాసం నవమి తర్వాత తొమ్మిది రోజులకు స్వాములవారి కల్యాణోత్సవం నిర్వహించడం ఆనవాయితీ. అనంతరం భక్తుల నడుమ సీతారామలక్ష్మణ విగ్రహాల ప్రాకారోత్సవం గావించారు.


పెన్నానదిలో సీతారాముల కల్యాణోత్సవ దృశ్యం

గౌతమేశ్వరాలయంలో పూజలు

గుత్తి: గుత్తి ఆర్ఎస్‌లోని గౌతమేశ్వరాలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రుద్రాభిషేకం, నవ గ్రహం హోమం, ఆంజనేయ స్వామి హోమం, మహా మంగళహారతి వంటి ప్రత్యేక పూజలు చేశారు. బుధవారం ఆలయంలో ప్రాణ ప్రతిష్ట కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షుడు శేఖర్ రెడ్డి తెలిపారు. అదే విధంగా ఆంజనేయస్వామి, వినాయక, నవ గ్రహాల ప్రతిష్ట ఉంటుందన్నారు.

ఘనంగా దండు మారెమ్మ దేవర

గుత్తి: పట్టణంలోని ఎస్సీ కాలనీలో మంగళవారం దండు మారెమ్మ దేవర (జాతర) ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. మున్సిపల్ చైర్ పర్సన్ వన్నూర్ బీ, వైఎస్సార్ సీపీ మాజీ పట్టణ కన్వీనర్ పీరా, షఫి తదితరులు హాజరై దండు మారెమ్మ దేవతకు పూజలు నిర్వహించారు.

పరమపదనాథ అలంకరణలో రాముడు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని ఏటిగడ్డపాలెంలో ఉన్న ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం రామచంద్రుడు శ్రీ పరమపదనాథ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రీరామనవమి ఉత్సవాలు పరమపదనాథ అలంకరణతో ముగిశాయి. అంతకు మునుపు ఆంజనేయస్వామి మూల విరాట్‌ను అలంకరించి అభిషేకాలు నిర్వహించారు.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

బుక్కరాయసముద్రం: కూటమి ప్రభుత్వం ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని కేవీపీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు నల్లప్ప, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి క్రిష్ణమూర్తి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని సిద్దరాంపురంలో ఉపాధి కూలీలు చేపడుతున్న పనులను వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు 11 వారాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఉపాధి పనుల వద్ద ఎలాంటి సౌకర్యాలు కల్పించ లేదన్నారు. బిలుల్లు చెల్లించడంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందన్నారు. కూలీలకు కనీసం మంచినీళ్లు, మజ్జిక ప్యాకెట్లు పంపిణీ చేయాలన్నారు. మెడికల్ కిట్లు ఎక్కడా లేవన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా రోజుకు రూ.600 వేతనం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి నాగలింగమయ్య, వెంకటేశులు, పుల్లయ్య, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించండి

పెద్దవడుగూరు: పంచాయితీరాజ్ శాఖ సిబ్బంది విధులను సక్రమంగా నిర్వర్తించాలని డ్వామా పీడీ సలీమ్‌భాషా ఆదేశించారు. మంగళవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధి పథకం రికార్డులను పరిశీలించారు. ఉపాధి సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా, విధులకు గైర్హాజరైనా కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బారెన్‌సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

క్లుప్తంగా

రోడ్డు నిబంధనలు పాటించండి


ఆటో డ్రైవర్లతో మాట్లాడుతున్న సీఐ ఈరన్న

యాడికి/బుక్కరాయసముద్రం: రోడ్డు నిబంధనలు పాటించాలని సీఐ ఈరన్న హెచ్చరించారు. మంగళవారం యాడికిలోని చెన్నకేశవ స్వామి ఆలయం వద్ద ఆటో డ్రైవర్లతో సీఐ ఈరన్న సమావేశమై మాట్లాడారు వాహన డ్రైవర్లు మద్యం సేవించి వాహనాలను నడపరాదన్నారు. ఫోన్‌లో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయొద్దన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ వెంకటేష్, పోలీసులు పాల్గొన్నారు. అలాగే బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని అనంతపురం-తాడిపత్రి రహదారిపై ఆదివారం సాయంత్రం పోలీసులు వాహనాలు తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ శేషగిరి రికార్డులు సరిగాలేని వాహనదారులకు జరిమానా విధించారు.

మాజీ సైనిక ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

తాడిపత్రిటౌన్: పట్టణంలో మంగళవారం మాజీ సైనిక ఉద్యోగుల అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక కార్యక్రమం నిర్వహించారు. కార్యవర్గ అధ్యక్షుడిగా పెద్దయ్య, వైస్ ప్రెసిడెంట్‌గా పీరయ్య, ట్రెజరర్‌గా రఘునాథరెడ్డి, సెక్రటరీలుగా రంగారెడ్డి, శ్రీధర్‌బాబు, ముఖ్య సలహాదారులుగా కాళిదాసురాజు, మనోహర్‌రెడ్డి ఎంపికయ్యారు. వారు మాట్లాడుతూ మాజీ సైనికుల సమస్యల పరిష్కారం కోసం కృషి చేస్తామన్నారు.

సాయిసిద్దార్థ కళాశాల విద్యార్థులకు అభినందన


ఆర్మాట్ మెహక్ సుల్తానాను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు

తాడిపత్రిటౌన్: సాయి సిద్దార్థ జూనియర్ కళాశాల విద్యార్థులకు అభినందనలు వెల్లువెత్తాయి. ఇంటర్ పరీక్ష ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో మంగళవారం కళాశాల యాజమాన్యం అభినందన కార్యక్రమం నిర్వహించింది. ఇంటర్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని ఆర్మాట్ మెహక్‌సుల్తానా 992 మార్కులతో స్టేట్ ఫస్ట్ సాధించడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, వైస్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని తల్లిదండ్రులు షామీర్‌బాషా (చాలవేముల ప్రాథమిక పాఠశాల టీచర్), కలిమున్నిసాకు పుష్ప గుచ్ఛం అందజేసి అభినందించారు. అలాగే ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులను అభినందించారు.

ముగిసిన ఉరుసు

పెద్దవడుగూరు: మండలంలోని లక్ష్ముంపల్లిలో రెండు రోజులుగా జరుగుతున్న పక్కీరప్ప స్వామి ఉరుసు మంగళవారం ఘనంగా ముగిసింది. ఈ సందర్భంగా ఉదయం నుంచి గ్రామంలోని దర్గా వద్దకు భక్తులు చేరుకొని ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సాయంత్రం మహిళలు దర్గా వద్దకు చేరుకుని చక్కెర చదివించారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొనడంతో దర్గా ప్రాంగణం కిటకిటలాడింది.

పామిడి విద్యార్థినికి సత్కారం


విజయవాడలో ధృతికాబాయిని సత్కరిస్తున్న మంత్రి లోకేష్

పామిడి: ఏపీ ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన పామిడికి చెందిన విద్యార్థిని ధృతికబాయిని విద్యాశాఖ మంత్రి లోకేష్ సత్కరించారు. కర్నూలు జిల్లా బనవాసిలోని ఏపీఆర్‌జేసీ విద్యనభ్యసించిన ఆమె 987/1000 మార్కులతో ఆ జిల్లా టాపర్‌గా నిలిచింది. దీంతో ఆమెను ప్రత్యేకంగా విజయవాడకు పిలిపించుకుని మంత్రి లోకేష్ సత్కరించారు.

ఘనంగా గ్రామోత్సవం


విందులో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ నాయకులు

పెద్దవడుగూరు: మండలంలోని మల్లేనిపల్లిలో మంగళవారం సుంకులమ్మ, చౌడమ్మతల్లి గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గుమ్మడాల నాగరాజు, గ్రామస్తులు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాలు సమర్పించారు. అనంతరం ఏర్పాటు చేసిన విందు కార్యక్రమానికి వైఎస్సార్‌సీపీ నాయకులు రాష్ట్ర కార్యదర్శి కొనెదల రమేష్‌రెడ్డి, మహిళా ప్రధాన కార్యదర్శి పేరం స్వర్ణలత, పామిడి ఎంపీపీ బోగాతి మురళీమోహన్‌రెడ్డి, ఏడీసీసీ బ్యాంకు మాజీ చైర్మన్ వీరాంజనేయులు, నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.

లేబర్ కోడ్‌లు రద్దు చేసే వరకూ పోరాటం


మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు నాగేంద్ర

గుంతకల్లుటౌన్: కార్మికులకు ఉరితాడులా మారిన లేబర్‌కోడ్‌లను రద్దు చేసే వరకూ పోరాటాలు కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి నాగేంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో జరిగిన సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. లేబర్‌కోడ్‌లను రద్దు చేయాలని మే 20న దేశవ్యాప్తంగా కార్మికులు నిర్వహించనున్న సమ్మెను జయప్రదం చేయాలన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాడాలన్నారు. మే డే వేడుకలను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ పట్టణ కార్యదర్శి సాకే నాగరాజు, అధ్యక్షుడు జగదీష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాళ్లు రేష్మా, గంగమ్మ, శైలజ, ఆశా యూనియన్ నాయకురాళ్లు పరిమళ, గ్రామిక, రంగమ్మ, కార్మిక సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పి.కొట్టాలపల్లి పంచాయతీకి అవార్డు


పంచాయతీ కార్యదర్శికి అవార్డు ప్రదానం చేస్తున్న దృశ్యం

పెద్దవడుగూరు: టీబీ నియంత్రణ, రహిత గ్రామంగా ఎంపికైన మండలంలోని పి.కొట్టాలపల్లి గ్రామ పంచాయతీకి ఉన్నతాధికారులు అవార్డు ప్రదానం చేశారు. మంగళవారం పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరెడ్డికి డాక్టర్ శ్రీనివాసబాబు, అమర్‌నాథ్ లు అవార్డు, ప్రశంసా పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో చిన్నవడుగూరు ఏఎన్ఎం సరోజమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ జ్యోతి, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, గుత్తి టీబీ యూనిట్ అధికారి జాఫర్, మన్సూర్‌అలీ, ఎంపీహెచ్ఎస్ దేవదాస్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ విక్రయించినా, వాడినా చర్యలు

గుత్తి: ప్లాస్టిక్‌ను విక్రయించినా, వాడినా కఠిన చర్యలు తప్పవని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా, శానిటరీ ఇన్‌స్పెక్టర్ మహబూబ్ బాషా హెచ్చరించారు. పట్టణంలో మంగళవారం మున్సిపల్ అధికారులు, మున్సిపల్, సచివాలయ సిబ్బంది ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్ని దుకాణాలు, హోటళ్ల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ను సేకరించారు. వారు మాట్లాడుతూ జనప నార సంచులు, పేపర్ సంచులు వాడాలన్నారు. ఇక నుంచి ప్లాస్టిక్‌ను విక్రయిస్తే జరిమానాతో పాటు కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కసాపురంలో కోల్డ్ స్టోరేజీ ఏర్పాటు

గుంతకల్లు రూరల్: బళ్లారికి చెందిన నల్లబోతుల నరేంద్రనాథ్ అనే భక్తుడు రూ. 5 లక్షల వ్యయంతో కసాపురం నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేశారు. స్వామివారి నిత్యకైంకర్యాలకు ఉపయోగించే కూరగాయలు, సామగ్రిని భద్రపరిచేందుకు కోల్డ్ స్టోరేజీని ఏర్పాటు చేసినట్లు దాతలు తెలిపారు. ఆలయ ఈఓ కే వాణి, ఇతర సిబ్బంది దాతల ఆధ్వర్యంలో మంగళవారం కోల్డ్ స్టోరేజీని ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతల కుటుంబ సభ్యుల పేరున ఆలయంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు అనంతరం వారికి తీర్థ ప్రసాదాలను అందజేశారు.

'పాస్టర్ ప్రవీణ్ మృతి తీరనిలోటు'


పొట్టి శ్రీరాములు సర్కిల్‌లో క్యాండిల్స్‌తో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

గుంతకల్లు: క్రైస్తవ సమాజానికి పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతి తీరని లోటని పట్టణ యూనిటెడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరమ్ నాయకులు అన్నారు. ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ ఆత్మకు శాంతి చేకూరాలని యూనిటైడ్ క్రిస్టియన్ వెల్ఫేర్ ఫోరమ్ ఆధ్వర్యంలో వందలాది మంది క్రిస్టియన్లు మంగళవారం సాయంత్రం పట్టణ పురవీధుల్లో శాంతి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రైల్వేస్టేషన్ రోడ్డు, గాంధీచౌక్, ప్రధాన రహదారి మీదుగా మున్సిపల్ కారాలయం, పొట్టి శ్రీరాములు సర్కిల్ మీదుగా ర్యాలీ సాగింది. కార్యక్రమంలో వెల్ఫేర్ ఫోరమ్ కమిటీ నాయకులు, క్రైస్తవులు పాల్గొన్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
తాడిపత్రి డివిజన్
9912220722, 7093156622, 9912220732